## మినీ కథావీధి

# ట్విస్ట్



"దుర్గ్" "దుర్గ్" అన్నమాట విని ఆ టెంపోలో కూర్చున్నాను. ఒకసారి చుట్టూ పరికించాను. నాతో కలిపి అయిదుగురు వున్నాం. ఇంతలో మరో ముగ్గురు వచ్చి అదే వాహనాన్ని అధిరోహించారు. అధిరోహించారనడం కన్నా కుక్కబడ్డారంటే సమంజసం. నా ఎదురుగా ముగ్గురు కాలేజీ అమ్మాయిలు కూర్చున్నారు. వాళ్ళ వేషధారణ, చేతుల్లో పుస్తకాలు వాళ్లు కాలేజీ విద్యార్థినులని చెప్పకే చెబుతున్నాయి. టెంపో మెల్లిగా కదిలింది. నాకు టెంపో అంటే ఒక విధంగా భయం, ఎందుకంటే ఒకసారి నేను ఇట్లాగే టెంపోలో వెళ్తుంటే ముందున్న టెంపో బోర్లాపడి దానంతట అదే మామూలు స్థితికి వచ్చి ముందుకు సాగిపోయింది. ఈ మాట చెప్తే మా ఇంట్లో వాళ్ళే నమ్మలేదు. ఒకందుకు సర్దాగా వుంటుంది. ఒక్కోసారి స్నేహితులు ఏర్పడుతుంటారు.

ఆ అమ్మాయిలు ముగ్గురూ హిందీలో గడగడా మాట్లాడుతున్నారు. వాళ్ళ మాటల్ని బట్టి వాళ్ళలో ఇద్దరి పేర్లు తెలిశాయి. మూడో ఆమె పేరుమాత్రం తెలియటంలేదు. ఆమె నోట్సు మీద కూడా పేరు లేదు. ఒక "దీవం" బొమ్మమాత్రం వేసివుంది. వాళ్ళ మాటల శబ్దం టెంపో (ఆటో) శబ్దాన్ని మించిపోయింది. నాకు ఒక జోకు గుర్తుకు వచ్చింది.

నయాగారా జలపాతానికి యాత్రికులను తీసుకువెళ్ళిన గైడు, యాత్రికులతో "చూడండి! ఈ జలపాతంనుండి వచ్చే శబ్దం లాంటిది ఈ ప్రపంచంలో లేదు. అంటే చాల యెక్కువశబ్దం అన్నమాట" అని ఆడవాళ్ళతో "అమ్మా! మీరో నిముషం మాట్లాడటం ఆపితే మీరు ఆ జలపాతపు శబ్దం వింటారు" అన్నాడట వినయంగా. నాకు ఫక్కున నవ్వొచ్చింది. అంతవరకూ నిశ్శబ్దంగా వున్న నేను నవ్వేసరికి వాళ్ళు ముగ్గురూ నావైపు ఉత్సుకతతో చూడసాగారు. వాళ్ళలో ఒక అమ్మాయి (దీవం బొమ్మ నోట్సు) అడిగింది "మిస్టర్ ఎందుకు నవ్వుతున్నారు?" అని హిందీలో. వెంటనే నాకో ఆలోచన వచ్చింది. నాలుగు రోజుల క్రితం చూసిన 'మరో చరిత్ర' గుర్తుకు వచ్చింది. సారీ-వచ్చిందికాదు గుర్తుకు తెచ్చుకున్నాను. జై కమల్‌హాసన్ అనుకుంటూ "ఐడోంట్ నో హిందీ. ఐ నో ఇంగ్లీష్ ఓన్లీ" అన్నాను అభ్యర్థనగా. "వై ఆర్ యూ లాఫింగ్?" అందామె. నేను "ఆ జోక్" చెప్పాను. వాళ్ళు ముగ్గురూ పగలబడి నవ్వసాగారు. నాకో విషయం ఆశ్చర్యమనిపించింది. ఆమె ఇంగ్లీషులో అడగడం, నేను చెప్పిన జోక్‌ని వాళ్ళు ఎంజాయ్ చేయటం. కారణం నాకు ఉత్తర భారతీయులకూ, ఉత్తర భారత దేశంలో చదువుకునేవాళ్ళకూ ఇంగ్లీషు రాదని నా అభిప్రాయం.

వాళ్ళలో సునీత అనే అమ్మాయి అడిగింది, 'మీ మాతృ భాష ఏమి'టని. నేను డైలమాలో పడ్డాను. "తెలుగు" అని చెప్పవచ్చు. కాని ఈ మధ్య ఆకాశవాణి రాయ్‌పూర్ కేంద్రంవారి పుణ్యమాఅని తెలుగు నేర్పుతున్నారు. అదీకాక రాష్ట్రేతరాంధ్రులంటే ఉత్తర భారతీయులు చిన్నచూపు చూస్తుంటారు. అందుకని ఠక్కున చెప్పాను "మళయాళం" అని. కారణం మలయాళీలలోని ఐక్యత నాకు బాగా నచ్చుతుంది. వెంటనే ఆ మూడో అమ్మాయి యేమిటో అడిగింది మలయాళంలో. బహుశా తనూ మలయాళీనే అంటుందేమో నాకా భాషతో అసలు టచ్ లేదు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ నన్ను నేనే తిట్టుకోవడం మొదలెట్టాను-నా మొహంలో ఆ భావాలు కన్పించకుండా వుండడానికి ప్రయత్నిస్తూ. అంతలో మొదట మ్మాయి ఫక్కున నవ్వి, 'ఎందుకు అబద్ధాలాడతారు? తెలుగువాళ్ళమని చెబితే మీ సొమ్మేం పోతుంది?" అంది తెలుగులో. నేను విస్మయంగా ఆమెవంక చూసి. "మీరూ తెలుగువాళ్ళేనన్నమాట. అయితే నేను తెలుగువాణ్నని ఎట్లా తెలిసింది?" అడిగాను. "మీరు తెలుగువాళ్ళని ఎట్లా తెలిసిందంటే-మీ చేతిలో వారపత్రిక చెప్పింది" అందామె. నేను ఆ నాటకం ఎందుకాడవలసి వచ్చిందో వివరించాను. ఒక కుర్రాడు అడుగుతున్నాడు, 'అమ్మా భిలాయ్‌నుంచి దుర్గ్ ఇంతదూరమా!' అని. ఆటోలో చాలామంది మా వైపే చూడసాగారు. టెంపో సైన్సు కాలేజీని సమీపించింది. నేనా తెలుగమ్మాయిని అడిగాను. "మీ పేరేమి"టని. "జ్యోతి" అందామె ఆటో దిగుతూ. "నేనడిగింది మీ పేరు, ఈ పుస్తకం పేరు కాదు" అన్నాను వీక్లీ చూపించి. "నా పేరూ అదే" అందామె చిరునవ్వుతో. వాళ్ళిద్దరూ అయోమయంగా చూడసాగారు మావైపు. మేము మాట్లాడుకుంటున్న భాష అర్థం కాకేమో! టెంపో బయలుదేరింది ముందుకు.

—పి. ఏడుకొండలస్వామి

